# తిరిగివచ్చిన కథ

నగలు లేకపోతేపోనీ నల్లపూసల పేరు వేసుకోవచ్చు, సిల్కు చీరలు లేకపోతేపోని ఉతికిన నూలుచీర కట్టుకోవచ్చు, గులాబీలు జాజి మల్లెలు లేకపోతేపోని దొడ్లో పూచిన మందారో మరో పువ్వో ముడుచుకోవచ్చు, స్నోలు పౌడర్లు లేకపోతేపోని సున్నిపిండితోనైన ముఖం రుద్ది కుంకుమ పెట్టుకొని లక్ష్మీదేవిలా వుంచవచ్చు; కలకల్లాడుతూ ఆనందాన్ని మూర్తీభవింపజేయవచ్చు. శ్రమని మరిపించి సంతోషాన్ని చేకూర్చవచ్చు.

ఇదే యిల్లాలు చేయకలిగింది చేయవలసింది భర్త ఆపేక్షించేది కూడ ఇది

కాని శ్యామల యీ సంగతి గుర్తించలేదు. అందుకనే కృష్ణమూర్తికి తనయింట్లో ఏదో ముఖ్యమైనది లోపించినట్లుంటుంది. పోనీ తన అమ్మ కామేశ్వరమ్మయినా కోడలిని అలా వుంచుదామని ప్రయత్నించినట్లు లేదు

మొదట్లో అట్టే వైముఖ్యం లేకుండానే కాలం గడచిపోయింది. కాపరానికి వచ్చి అరు నెలలవరకు శ్యామల పరిశుభ్రంగా వుండకపోవటం, చక్కగ జెడవేసుకొని తను తెచ్చిన పూలు పెట్టుకొని పరదాగా మాట్లాడకపోవటం బహుశః సిగ్గు, క్రొత్త కాపురం, అత్తవారిల్లు, పుట్టింటిమీద బెంగమూలాననేమో అనుకొని సమాధానపరచుకున్నాడు మూర్తి.

కాలం దొర్లినా ఆమె ఏబ్రాసిగానే వుంటోంది. ముఖం యెప్పుడూ జిడ్డు కారుతున్నట్టే వుంటుంది, చీర యెప్పుడూ మాసినా మాసినట్టే వుంటుంది, జడ వేసుకున్నట్టుగా వుండదు, జ్ఞాపకం చేస్తేకాని పూలు మాట గుర్తురాదు

మూర్తికి ఊహాసౌధాలు చవుడుపడుతున్నట్లనిపించింది. తన భార్య ఎలా వుండాలని, ఎలా వుండేటట్లు చేయాలని అనుకున్నాడో అందుకు విరుద్ధంగా శ్యామల కనిపించింది.

చాలాసార్లు సినిమాలకి, బీచికి తీసికెళ్ళి పరోక్షంగా తన మనోగతభావాన్ని శ్యామలకిచెప్పాడు. శ్యామలమీద అవిక్షణిక ప్రభావానిన్ని మాత్రమేచూపకల్గాయి.

శ్యామల కాపురానికొచ్చి సంవత్సరం న్నరయింది. కాని మూర్తి భావించిస ఆదర్శమూర్తి కాలేకపోయింది.

మూర్తికిదొక సమస్యగా పరిణమించింది. ఉదయం పది గంటలకు వెళ్ళి సాయంత్రం అయిదున్నర కింటికి వచ్చేవాడు. శ్యామల ఎక్కడో యిసురోమంటూ వుండేది. "మంచి నీళ్ళు కావాలా" అని మందహాసంతో తేనె లొల్కుతూ తనను శ్యామల పల్కరించాలని మూర్తి ఆశ. కాని శ్యామల అలా చెయ్యదు. ఒక్కొక్కప్పుడు కామేశ్వరమ్మే అడిగియిస్తుంది. చేతులలో తొందరపని లేకపోతే

ఎన్ని విధాల చెప్పిచూచినా శ్యామలలో మార్పురాలేదు. మూర్తికి ఆఫీసునుంచి యింటికి పోయేందుకు అట్టే మనస్కరించటం లేదు. అందుకని సరదాగా కబుర్లతోనో, చదువుకుంటూనో, మరేదన్నా ఆడుకుంటూనో కులాసాగా కాలక్షేపం చెయ్యవచ్చునని క్లబ్బుల్లో మెంబరుగా చేరాడు.

మూర్తి ఆఫీసు పని అయ్యాక క్లబ్బుకువెళ్ళి అక్కడ పింగ్, పాంగో, క్యారామ్సో ఆడుకుంటాడు. కాసేపు, మిత్రులతో కులాసాగా కబురు చెప్తాడు కాసేపు, మాగ్‌జైన్‌స్సు చదువుకుంటాడు కాసేపు. ఇలా ఎనిమిదిన్నరయ్యేవరకు కబ్బులోవుండి తర్వాత ఇంటికివెళ్ళేవాడు.

ఇంట్లోకూడ విరామకాలంలో పత్రికో, పుస్తకమో చదువుతూ వుంటాడు.

మూర్తిలో కలిగిన ఈ మార్పు శ్యామల గుర్తించినా కారణంత నేనని మాత్రం గ్రహించలేకపోయింది.

మూర్తి పత్రికలకి కథలు వ్రాసి పంపటం ప్రారంభించాడు. పట్టుదలతో వ్రాయటం మూలాన కొన్నికథలు ప్రచురణ అయ్యాయి.

మూర్తికి ఇదొక ఉబుసుపోక అయ్యింది. శ్యామలకి కొంచెం కష్టమనిపించింది. కాని తన అయోమయ ధోరణి మార్చుకోవాలన్న సంగతి తెలియదు.

ఒకనాడు మూర్తి ఆఫీసుకు వెళ్ళాక ఒక కవరు వచ్చింది. మూర్తిపేర అది అంటించలేదు బుక్‌పోస్టు, శ్యామల ఏమిటా అని తీసి చూసింది. తన భర్త వ్రాసినకథ ఎవరో పత్రికాధిపతులు త్రిప్పి పంపారు.

చదవాలనిపించింది శ్యామలకి. చదివింది చకితురాలయ్యింది. ఆశ్చర్యపడింది. పశ్చాత్తాపం చెందింది. తల తిరిగినట్లంది. ఏదో సందేశం తరణోపాయం ప్రబోధించినట్లయింది. ఆ కథ తన సుఖసంసార నౌకకి చుక్కాని మాదిరి అమరింది. తననుగురించే తమ సంసారాన్ని గురించే ఆ కథ. తనవంటి జడ్డిభార్యతో విసిగి వేసారిన భర్త మనోవ్యథతో, నిరాశతో బాధపడతాడు. అర్ధరాత్రివరకు కబ్బులో గడుపుతుంటాడు. భర్త మిత్రునితో చెప్పుకొంటాడు తన మధురస్వప్నాలు భంగమైన రీతినిగూర్చి. ఆ మిత్రుడు భార్య సమేతంగా వెళ్ళి ఆ ఇల్లా

లికి అసలుసంగతి వివరిస్తాడు. ఉన్నదానిలో ఉత్తమంగా అలంకరించు
కుని గృహలక్ష్మిలా వుండమని హితవు చెప్పి ఒప్పిస్తారు. ఆ ప్రకారం
గానే ఆమె ఆచరించి భర్త ఆదరాభిమానాలని పొంది ప్రేమపాత్రురా
లౌతుంది.

ఆ కథని శ్యామల తంపెడైలో బహుజాగ్రత్తగా దాచింది.
ఆనాడు చక్కగా సింగారించుకుంది. మల్లెపందిర ప్రక్కన పీటవేసు
కుని పూలు కోసుకుంటుండే చూసి ఆశ్చర్యపోయింది కామేశ్వరమ్మ.
మూర్తి ఇంటికి రాగానే నవ్వుతూవెళ్ళి చేతిలోని బ్యాగ్ తీసుకుంది.
మంచినీళ్ళు తెచ్చిచ్చి విసనకర్రతో నెమ్మదిగా విసురుతూ "మరీ యింత
ప్రొద్దుపోయేవరకు అక్కడక్కడికి వెళ్ళకుండా త్వరగా యింటికి
వచ్చేయకూడదూ" అంది బహు లాలనగా, ఆమెలో కలిగిన యీ
మార్పుకి, ఆమె ముఖంలో నాట్యం చేస్తున్న సంతోషరేఖలకి, ఆమె
పెదవులమీద దోబూచులాడుతున్న చిరునవ్వురాసులకి మూర్తికి కారణం
తెలియలేదు. కాని అతని హృదయంలో ఆనందం పొంగిపొరలింది.
తియ్యని కలలు యథార్థమైనటు స్ఫురించింది. మూర్తి చిరునవ్వుతో
"అలాగె వస్తాను; నువ్వు ఇలా వుంటానంటే" అన్నాడు. తెలియని వారి
నవ్వులలో "ఎంగకులదన, ఎందుకురాచు" అనే మాటలు కలిసి
పోయాయి

శ్యామల ఇప్పుడు ఆదర్శగృహిణి, ఆనందం తాండవింపజేస్తోంది.
"ఉన్నదానిలో ఉత్తమంగా అలంకరించుకుని గృహలక్ష్మిలావుంటుంది
మూర్తి ఆమెకు ఆదర్శగృహస్థు. వారి ప్రణయనౌకకు అనుకూల
మారుతాలనురాయి. వారిల్లు ఆనందానికి ఆటపట్టు, సంతోషానికి పట్టు
కొమ్మ.

ఆమెలో కలిగిన ఈ పరిణామానిం మూర్తి వేవేల దేవతలని
సన్నుతిస్తున్నాడు. కాని అసలు కారణం "తిరిగివచ్చిన కథ" అని
మాత్రం తెలియదు.